నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, మంగళవారం 21 జనవరి 2025 HYDERABAD




సికింద్రాబాద్ మేకల మండి రహదారిలో రోడ్డు పక్కన వ్యర్థాలను తొలగించకపోవడంతో దుర్గంధంగా మారిన పరిసరాలు



మీర్‌పేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చిత్రంలో ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు




గత బీఆర్ఎస్ ప్రభుత్వం..ట్యాంక్‌బాండ్‌ను సుందరీకరించింది. వివిధ ఆకృతులు, కళాఖండాలను ఏర్పాటు చేసింది. సాగర తీరాన్ని మరింత ఆహ్లాదకరంగా మార్చింది. అందులో భాగంగానే ట్యాంక్‌బండ్‌పై ఉండే పార్కులో సందర్శకులు కాస్త రిలాక్స్ అయ్యేందుకు బల్లలు ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం నిర్వహణ లోపంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆ బల్లలు అప్పట్లో ఎలా ఉండే..ఇప్పట్లో ఎలా ఉందనేది..పై రెండు చిత్రాల్లో చూడొచ్చు.

# రేవంత్ హామీలన్నీ నీటి మూటలే

## ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట పరిధిలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి సోమవారం ఆమె శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దాటవేత ధోరణి అవలంభిస్తున్నదన్నారు. ప్రజా పాలన దరఖాస్తులను మూలకు పడేసి.. మరోసారి రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు కోసం వేర్వేరుగా సర్వేలు చేయడం ఎందుకన్నారు. సర్వేల పేరుతో కాలయాపన చేయడానికి ప్రభుత్వం ఆడుతున్న నాటకమన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్నిప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేశారని చెప్పారు. ప్రతి ఇంటికి మంచి నీళ్లు అందించేందుకు మిషన్ భగీరథ ద్వార రూ.370 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ జ్ఞానేశ్వర్, కార్పొరేటర్లు భిక్షపతి చారి, అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

# అంతా అయోమయం

## రేషన్‌కార్డుల జారీలో అనుమానాలెన్నో

### ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల సర్వేనే కాలే

### నేటి నుంచి గ్రామ, వార్డు సభలు

### అర్హుల జాబితాపై దరఖాస్తుదారుల్లో ఆందోళన

మేడ్చల్, జనవరి 20(నమస్తే తెలంగాణ): కొత్త రేషన్ కార్డుల జారీలో అంత అయోమయం నెలకొన్నది. నేటి నుంచి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా జరిగే గ్రామ, వార్డు సభల్లో కొత్త రేషన్ కార్డులకు సంబంధించిన అర్హులైన లబ్ధిదారుల ఎంపిక జాబితాను ప్రవేశపెట్టేలా ప్రణాళికను సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నా.. నేడు జరిగే గ్రామ, వార్డు సభల్లో అర్హులైన లబ్ధిదారుల జాబితాను ఏ విధంగా సిద్ధం చేసారన్న దానిపై అయోమయానికి గురవుతున్నారు. నాలుగు గ్యారంటీల్లో ప్రధానంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకానికి లక్షలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. అయితే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసాకు అర్హుల ఎంపిక పేరిట సర్వేలు జరుగుతున్నాయి. కాగా, ఈ నెల 26 నుంచి లబ్ధిదారులకు పథకాలను వర్తింపజేస్తామని చెబుతున్నా.. ఆచరణలో అమలు ఎలా అవుతుందోనన్న ఆందోళన దరఖాస్తుదారుల నుంచి వ్యక్తమవుతున్నది.




### సర్వే చేయనేలేదు..

ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన పేరిట ఎంతో ఆర్భాటంగా వివిధ పథకాలపై ప్రజల నుంచి దరఖాస్తులను ఏడాది కిందట స్వీకరించిన విషయం తెలిసిందే. అయితే కొత్త రేషన్ కార్డుల జారీ కోసం ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల సర్వేనే చేయలేదు. ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుదారుల్లో మంగళవారం నుంచి జరిగే గ్రామ, వార్డు సభల్లో ప్రకటించే జాబితాలో వీరి ఎంపిక లేనట్లేనని తేలిపోయింది. ఏడాది కిందట చేసుకున్న దరఖాస్తుదారుల సర్వే ఎందుకు చేయలేదని దరఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకునే వారికి అవకాశం ఇచ్చిన నేపథ్యంలో కొత్తగా వచ్చిన దరఖాస్తులతో పాటు ప్రజాపాలనలో వచ్చిన అర్జీలను సర్వే చేసి పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామని అధికారులు చెబుతున్నారు.

### అర్హుల జాబితాలో ఉండేది వీళ్లే..

ఇటీవల చేసిన కులగణన సర్వేలో జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో 12,506 మందికి రేషన్ కార్డులను లేవని తేలిన పక్షంలో ఇదే జాబితాను గ్రామ, వార్డు సభల్లో ప్రవేశపెట్టనున్నారు. ఇదేకాకుండా జిల్లా వ్యాప్తంగా మార్పులు..చేర్పులకు సంబంధించిన 1.21 లక్షల మంది అర్హుల ఎంపిక జాబితాను గ్రామ, వార్డు సభల్లో ప్రవేశపెట్టి అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. దీంతో పాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల వివరాలను గ్రామ, వార్డు సభల్లో ఉంచి తదుపరి కొత్తగా వచ్చిన దరఖాస్తులతో కలిపి సర్వే(విచారణ) చేస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో రేషన్ కార్డుల కోసం ఇంకా ఎన్నాళ్లు వేచి ఉండాల్సి వస్తుందోనని నిరుత్సాహానికి గురవుతున్నారు.

### 1.22 లక్షల దరఖాస్తులు

మార్పులు.. చేర్పుల రేషన్ కార్డులను జారీ చేసి భారీ సంఖ్యలో రేషన్ కార్డులు జారీ చేసినట్లు చెప్పుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్న ఆరోపణలున్నాయి. రేషన్ కార్డులు ఉన్న వారికే మార్పులు.. చేర్పులను 1. 21 లక్షల మంది రేషన్ కార్డులు ఉన్న వారికే చేసి.. అనేక మందికి రేషన్ కార్డులను ఇస్తున్నట్లు చెప్పుకునేలా చేస్తున్నదన్న ఆరోపణలు వస్తున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 5,32,938 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. కొత్త రేషన్ కార్డుల కోసం జిల్లా వ్యాప్తంగా 1.22 లక్షల దరఖాస్తులు వచ్చాయి.




పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

# ఫీజు మొత్తం చెల్లించలేదని.. విద్యార్థులను బయట నిలబెట్టి..


### పల్లవి స్కూల్ యాజమాన్యం నిర్వాకం

### విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

చంపాపేట, జనవరి 20: లింగోజిగూడ డివిజన్‌లోని పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాల యాజమాన్యం ఫీజు మొత్తం చెల్లించలేదంటూ.. విద్యార్థులను ఆరుబయట నిల్చోబెట్టడం ఉద్రిక్తతతకు దారితీసింది. విద్యార్థుల తల్లిదండ్రుల కథనం ప్రకారం.. రూ. 85,000 చెల్లింపులో కేవలం రూ. 7,000 మాత్రమే పెండింగ్ ఉన్న విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వటానికి నిరాకరించిన స్కూల్ యాజమాన్యం.. పరీక్షలు రాయడానికి, తరగతి గదిలో కూర్చోవటానికి సైతం వీల్లేదని ఆ విద్యార్థులను సోమవారం తరగతి గదుల్లోంచి పిలిచి ఆరు బయట నిలబెట్టారు. ఈ విషయాన్ని విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా తెలియజేయడంతో వారు వెంటనే పాఠశాలకు చేరుకొని ప్రిన్సిపాల్ మోనిక చావుల కాత్యాల్‌ను కలిసి ఫీజు చెల్లింపు విషయంలో తమ పిల్లలను ఇబ్బందులకు గురి చేయడం తగదని, ఫీజులు చెల్లించాల్సిన బాధ్యత తమపై ఉంటుందని, పూర్తి ఫీజు చెల్లింపు కోసం ఇంకో నెల రోజుల గడువు ఇవ్వాలని కోరారు. ఇందుకు ప్రిన్సిపాల్ ఒప్పుకోకపోవడంతో పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనను విరమింపజేశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఆయన అక్కడికి చేరుకొని పాఠశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. ఈ క్రమంలో పాఠశాల నిర్వాహణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకునే ప్రయత్నంలో బల్దియా అధికారులను అక్కడికి పిలిపించారు. పాఠశాల నిర్వహణ స్థలం పూర్తిగా ప్రభుత్వ స్థలమేనని.. అయితే ఈ పాఠశాల కొనసాగింపు కోసం కావాల్సిన ట్రేడ్ లైసెన్స్ లేకపోవడమే కాకుండా.. ప్రాపర్టీ ట్యాక్సీ రూ. 14 లక్షలు చెల్లించడం లేదని బల్దియా అధికారుల పరిశీలనలో తేలింది. దీంతో పాఠశాల యాజమాన్యానికి వారు నోటీసులు అందించారు.

# పార్కుల ఆధునీకరణపై ఫోకస్

సిటీబ్యూరో: హెచ్ఎండీఏ పర్యవేక్షణలో ఉన్న పార్కుల్లో మౌలిక వసతుల కల్పనపై హెచ్ఎండీఏ అధికారులు ఎట్టకేలకు దృష్టి పెట్టారు. ఈ మేరకు పలు పార్కుల్లో వాకింగ్ ట్రాక్, చిన్న పిల్లల కోసం ఆట స్థలాల ఆధునీకరణ, బ్యూటిఫికేషన్ పనులను చేపట్టేలా ప్రణాళికలు రూపొందించారు. గడిచిన ఏడాది కాలంగా హెచ్ఎండీఏ పరిధిలో పార్కుల నిర్వహణ అధ్వానంగా మారడంతో స్థానికుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. అయినా అధికారులు ఆధునీకరణపై దృష్టి పెట్టలేదు. ఇటీవల పలు పార్కులు శిథిలావస్థకు చేరిన మౌలిక వసతులపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేయడంతో.. చివరకు అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న బీఎన్‌రెడ్డినగర్‌లోని రాజీవ్ గాంధీ పార్కులో మెట్ల మార్గం, వాకింగ్ ట్రాకులకు మరమ్మతులు, టాయిలెట్లను ఆధునీకరించనున్నారు. అదేవిధంగా సైన్ బోర్డులను ఏర్పాటు చేయనుండగా, డస్ట్ బీన్లను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఇక వనస్థలిపురంలోని అభ్యుదయనగర్ పార్కులో వాకింగ్ ట్రాక్ మరమ్మతులు, కంపౌండ్ వాల్ పెయింట్ పనులతోపాటు, ఇతర సివిల్ పనులు చేయనున్నారు. పోలీస్ స్టేషన్ పక్కనే ఉండే హెచ్‌ఎండీఏ పార్కును అభివృద్ధి చేయాలని అనేకసార్లు స్థానికులు ఫిర్యాదులు చేయడంతో... ఇటీవల ఆ పార్కులో వాకింగ్ ట్రాకులు, టాయిలెట్లతోపాటు ఆధునీకరించేందుకు హెచ్‌ఎండీఏ అధికారులు చర్యలు చేపట్టారు.



సోమవారం రసూల్‌పుర మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు.

# మిస్సింగ్ కేసులంటే అలుసా?

### అంతగా దృష్టిపెట్టని పోలీసులు

### సమన్వయం లోపంతో మరింత నష్టం

### అనేక ఠాణాల్లో ఇదే పరిస్థితి

### పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు

సిటీబ్యూరో: మిస్సింగ్ కేసుల పట్ల నగర పోలీసులు నిర్లక్ష్యం చూపుతున్నారన్న విమర్శలొస్తున్నాయి. ఒక వ్యక్తి అదృశ్యమయ్యాడంటూ ఫిర్యాదు చేసిన తరువాత అతని ఆచూకీ తెలిసిందా? ఎక్కడకు వెళ్లాడు..? అనే విషయాలు తెలుసుకోవడానికి కుటుంబ సభ్యులు చెప్పులు అరిగేలా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగాల్సిన పరిస్థితి నెలకొంటున్నది. మిస్సింగ్ అయిన వారి వయస్సును బట్టి ఒక అంచనాకు వచ్చి దర్యాప్తు జరుపుతుంటారు. అయినా కూడా వారి అంచనాలు తారుమారవుతూ సరైన సమయంలో స్పందించకపోవడంతోనే మిస్సింగ్ అయిన వారు శవాలుగా తేలడం వంటి ఘటనలు జరుగుతుంటాయి. అయినా కూడా పోలీసుల్లో మార్పు రావడం లేదు. మిస్సింగ్ కేసు అంటేనే తేలికగా తీసుకునేవారు చాలా మంది ఉన్నారు. దీనికి తోడు పోలీస్‌స్టేషన్ల మధ్య సమన్వయం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఒకే పోలీస్‌స్టేషన్‌లో సెక్టార్ల వారీగా కూడా సమన్వయం లేని పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో ఠాణాలు, డివిజన్లు, జోన్లు, కమిషనరేట్ల మధ్య సమన్వయం ఎలా ఉంటుందో అట్టే అర్థమవుతున్నది. మిస్సింగ్ కేసుల్లో అన్ని కేసుల్లోనూ వేగంగా స్పందించాల్సిన అవసరముంటుంది. సెల్ ఫోన్లు, సీసీ కెమెరాలను బట్టే కేసును ఛేదించే పోలీసులు, ఈ విషయాలపై కూడా దృష్టి పెట్టకుండా పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధిత కుటుంబసభ్యులను తిప్పి పంపిస్తున్న ఘటనలు జరుగుతున్నాయి.




### 15 రోజుల కిందట..

నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో 15 రోజుల కిందట ఒక వ్యక్తి మిస్సింగ్ అయ్యాడంటూ కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. అయితే మిస్సింగ్ అయిన వ్యక్తి గురించి అక్కడి పోలీసులు ఏ మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగినా.. ఇంకా దొరకలేదనే సమాధానమే వస్తున్నది. మీ కేసు చూసే ఎస్సై లేడు.. 15 రోజులు పడుతుంది... చూద్దామంటూ పెద్దసార్లు సమాధానం.. ఇలా రద్దీగా ఉండే నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసులంటే చాలా లైట్‌గా తీసుకుంటున్నారు.

### భార్య కనిపించడం లేదంటూ..

తన భార్య కన్పించడం లేదంటూ పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, మరుసటి రోజు మాదాపూర్ పోలీస్‌స్టేసన్ పరిధిలో ఒక మహిళ మృతదేహం లభించిందని, 4న ఈ విషయం పంజాగుట్ట పోలీసులు గుర్తించారని ఇటీవల సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఓ జర్నలిస్ట్ తన ఆవేదనను వ్యక్తం చేశారు.

### రోడ్డు ప్రమాదంలో చనిపోతే..

ఏడాది కిందట చాదర్‌ఘాట్ ఠాణాలో శ్రావణ్‌కుమార్ అనే యువకుడు కనిపించడం లేదంటూ అతడి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. అయితే అదే యువకుడు అదే పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదానికి గురై.. మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని గుర్తుతెలియనిదిగా భావించి.. ఉస్మానియా మార్చురీకి తరలించారు. తల్లిదండ్రులు కొడుకు ఫొటో పట్టుకొని 20 రోజుల పాటు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. పోలీసులపై నమ్మకం లేక తల్లిదండ్రులే నగరంలో తెలిసిన చోట వెతికారు. ఇలా తిరుగుతున్న క్రమంలోనే ఉస్మానియా మార్చురీకి కూడా వెళ్లి పరిశీలిస్తే.. కొడుకు మృతదేహం కనిపించింది. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పడంతో కంగుతిన్నారు. పోలీసుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలొచ్చాయి.

# సాక్షాత్తు ఎమ్మెల్యేకే సమాచారమివ్వలేదు

### నిజాంపేటలో 'ప్రారంభోత్సవం' వివాదాస్పదం

### సరైన సమాచారమివ్వలేదన్న ఎమ్మెల్యే వివేకానంద్

### బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి యత్నం

### ఇరువర్గాలను శాంతింపజేసిన పోలీసులు

### పోలీసులు దురుసుగా ప్రవర్తించారన్న బీఆర్ఎస్ శ్రేణులు

దుండిగల్, జనవరి 20: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో రూ.8.69 కోట్ల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం వివాదాస్పదంగా మారింది. 'నాకు సరైన సమాచారం ఇవ్వకుండా ప్రారంభోత్సవాలు ఎలా చేస్తారు'? అంటూ స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డిని సైతం నిలదీశారు. గతంలో మనం ఏ పార్టీలో ఉన్నా, కలిసి పని చేసే వాళ్లమని, మరి ఇప్పుడెందుకు సరైన సమాచారం ఇవ్వకుండా హడావుడిగా ప్రారంభోత్సవాలు ఎందుకు పెట్టుకోవాల్సి వచ్చిందని నిలదీశారు. అయితే, మరోసారి ఇలా జరుగకుండా చూసుకుందామని చీఫ్ విప్ చెప్పడంతో సమస్య సద్దుమనిగింది. అయితే, ప్రగతినగర్ కమాన్ వద్ద సీసీ రోడ్ల ప్రారంభోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి యత్నించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలను శాంతింపజేశారు. అయితే బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించి తోసివేశారని, కొందరు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల చొక్కాలను సైతం చించివేశారని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేక్కడిని న్యాయమని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఒకనీతి తమకో నీతా అంటూ పోలీసులను ప్రశ్నించారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

### బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి

### ఎమ్మెల్యే వివేకానంద్

బీఆర్ఎస్ పాలనలోనే నిజాంపేట్ కార్పొరేషన్‌ను కోట్లాది రూపాయల నిధులతో మోడ్రన్ కార్పొరేషన్‌గా అభివృద్ధి చేశామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల్లో సుమారు రూ.8.69 కోట్ల రూపాయల నిధులతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు, బీటీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులను ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు చోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మోడ్రన్ కార్పొరేషన్‌గా అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, నిజాంపేట మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ,కార్పొరేటర్లు బాలాజీ నాయక్, గాజుల సుజాత ప్రణయ ధనరాజ్ యాదవ్, ఆగంరాజు తదితరులు పాల్గొన్నారు.